

నల్ల పిల్లి నాలుగు పిల్లల్ని పెట్టింది. అందులో రెండు నల్లవి. దాని పోలికే. మిగిలిన రెండు పిల్లులూ బూడిదరంగు మీద నల్ల చారల్తో తండ్రి పోలికతో ఉన్నాయి. వాటిని నెమ్మదిగా తెచ్చి వంటింటి అలమార్లో పెట్టింది. అమ్మమ్మ వాటిని చూసి హడలిపో యింది. పిల్లుల కళ్లరెప్పలకు వెంట్రుకలుం డవు. పైగా కళ్లు మెరుస్తున్నట్లుగా ఉంటాయే మో... చూట్టానికి చాలా భయంగా అన్పిస్తుంది.

"బాలింత పిల్లికి పాలుపోద్దాం అమ్మమ్మా! లేకపోతే దానికి బలంరాదు. పిల్లలకు పాలు ఇవ్వలేదు" అంది సింధు.

అమ్మమ్మ పిల్లిమీద దండకం మొదలు పెట్టింది "వెధవ కానా! పోవేముందు. సిగ్గులేదే నీకు. అలానిలబడ్డావేం? కదులూ... దేవుడు మైల పడతాడే... పోముందు."

అమ్మమ్మ కేకలకు అది బెదరకుండా తాపీ గా గిన్నెలో పాలుతాగి మీసాలు తుడుచుకుం టోంది.

తాతయ్య తమాషాచూస్తూ నవ్వుతున్నాడు. "పోనీలేవే... అవి మాత్రం ఎక్కడికి పోతాయి? బయటకి పోతే కాకులూ కుక్కలూ వాటి వెంట పడతాయి. ఇంట్లోవుంటేనే క్షేమం". "అయినా పిల్లలకి ఊహ తెలిసాక వాటిని ఏడిళ్లు తిప్పు తుంది పిల్లి" తాతయ్య జాలిపడ్డాడు.

"ఈలోగా వాటిని మీ చంకన వేసుకుని తిప్పండి" అమ్మమ్మకు ఆవేశంతో బ్లడ్‌ప్రెషర్ పెరిగిపోతోంది.

"అదికాదు... అవి చిన్నవి. వాటికేం తెల్సు? మొన్న ఒక పిల్లిపిల్ల కోతికి చిక్కింది. అది దాన్ని ముందుకీ వెనక్కీ కదలనివ్వదు. ఇక ఆ పిల్లిపిల్ల బొమ్మలాగా ఆ కోతితో ఆడుకుంది. దానిని

# నల్లపిల్లి



పేపరువాళ్ళు ఫొటోతీసి, 'కోతీపిల్లీ అనుబంధం' అని కాప్షన్ రాసి సొమ్ముచేసుకున్నారు. కానీ అది పిల్లికి ప్రాణసంకటం, కోతికి చెలగాటం అవి వాళ్ళకు తెలియదు" తాతయ్య బాధగా అన్నాడు.

తల్లి పిల్లి రావడం, "మ్యావ్ మ్యావ్" అనడం... తరువాత పిల్లి పిల్లలు "మ్యావ్ మ్యావ్" అంటూ బదులు పలికి, దాని చుట్టూ చేరి పాలు తాగడం... ఇది రోజు వారీ తంతు ఆ ఇంట్లో.

అమ్మమ్మకు మాత్రం కష్టం పెరిగిపోతోంది... "పాడు పిల్లులు. బయటకి కొట్టండి. ప్రతి దాంట్లోనూ మూతులు పెడ్తున్నాయ్. దేవుణ్ణికూడా మైల చేసాయి"

అమ్మమ్మ బాధ చూడలేక సింధు కర్రతెచ్చి వాటిని అదిలించేది. అవి కదలకపోగా ఒక మూలనుంచి ఇంకో మూలకు పరుగులు తీసేవి.

"పోనీయమ్మమ్మా! తాతయ్య భూతదయ చూపించారు... అవి కూడా బ్రతకాలి కదా!"

"చాల్లే సంబడం... క్రితంసారి రెండు పిల్లల్ని పెట్టింది. పోన్లే పాపం అన్నారు. అవి పెరిగాక ఈ ఇంటిని ఒకకొలిక్కి తెచ్చాయి. సరిపోనట్టు ఈ తల్లి వాటికి ఎలకల్ని వేటాడటం నేర్పింది. దానికోసం మాంసంముక్కలు మూల పెట్టడం. ఇదంతా ఎంత రోత?"

అమ్మమ్మ పోరు పడలేక తాతయ్య కర్ర తీసుకుని పిల్లిపిల్లల మీదకు వెళ్ళారు. అవి "మ్యావ్ మ్యావ్" అంటూ అటుగెంతీ, ఇటు గెంతీ ఆయన్ని ఆడించి ఆయాసపెట్టాయి.

"మీరు కల్పించుకోరుగానీ నేను చెయ్యాల్సింది చేస్తాను" అల్టిమేటం ఇచ్చింది అమ్మమ్మ.

ఆ సాయంత్రం మేస్త్రీ సీతయ్యకు కబురు వెళ్ళింది. రెండు గోనె సంచులలో నాలుగు పిల్లి పిల్లలూ తల్లికి దూరంగా రవాణా అయిపోయాయి.

రోజూ నల్లపిల్లి వస్తూనే ఉంది. "మ్యావ్ మ్యావ్" అంటూ తన పిల్లల్ని పిలుస్తూనే ఉంది.

సింధు చాలా బాధపడేది. తాతయ్యలో హుషారు లేకపోవడంతో "తప్పు జరిగిందా తాతయ్యా?" అని అడిగింది.

తాతయ్య నవ్వాడు. "ఈ ప్రపంచంలోకి నేను కూడా మూడు పిల్లుల్ని తీసుకు వచ్చానమ్మా... ఇరవై నాలుగ్గంటలూ వాటికి అవి ఇవ్వు, ఇవి ఇవ్వు అని భగవంతుడి చెవిలో పోరుపెట్టాను. ఆ బాధపడలేక భగవంతుడు నా ముగ్గురు పిల్లుల్ని... సారీ పిల్లల్ని చదువు బాగా ఇచ్చి ఒకళ్ళను దూరంగా అమెరికాలోనూ, ఇంకొకళ్ళని బొంబాయిలోనూ వదిలాడు. ఇంకొక పిల్లిని... మీ అమ్మను మాత్రం ఈ ఊళ్ళోనే మాకు దగ్గరలో ఉంచాడు. అప్పుడప్పుడూ మా పిల్లుల్తో... సారీ పిల్లల్తో నేనూ, మీ అమ్మమ్మా మ్యావ్... మ్యావ్... మంటూ ఉంటాం ఫోన్లో". పైకి నవ్వేసినా తాతయ్య మనసులో బాధ ముల్లులా గుచ్చుకుంటోందని అర్థమవుతూనే ఉంది. ●

**గరిమెళ్ళ కావ్యలేఖ**

**మొదటికథ**